సాక్షి
అనకాపల్లి
బుధవారం । 29 । జనవరి । 2025



అట్టహాసంగా స్పోర్ట్స్ మీట్

విశాఖలో నిర్వహిస్తున్న ఇంటర్ పాలిటెక్నిక్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ ఘనంగా ప్రారంభమైంది. 13 జిల్లాల నుంచి పాల్గొన్నారు. 8లో



ఏయూలో వ్యవసాయ పరిశోధనలు

విశాఖ విద్య: ఏయూలోని వ్యవసాయ పరిశోధనలపై ఏఈఆర్‌సీ కేంద్రం డైరెక్టర్ లిల్లిగ్రేస్ సమీక్ష సమావేశం నిర్వహించారు.



శ్యామలా నవరాత్రి ఉత్సవాలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ త్రిశక్తి ఆలయంలో ఈనెల 30 నుంచి శ్యామలా(గుప్త) నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నారు.

న్యూస్‌రీల్

పశువుల రక్షణకు ఆరోగ్య శిబిరాల ఏర్పాటు

- రాష్ట్ర పశు సంవర్ధకశాఖ ఏడీ డా.చిన్నయ్య



చిననందిపల్లిలో పశు ఆరోగ్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డా.చిన్నయ్య

దేవరాపల్లి: పశువుల రక్షణకు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నామని రాష్ట్ర పశు సంవర్ధకశాఖ అదనపు సంచాలకుడు డాక్టర్ ఆర్.చిన్నయ్య తెలిపారు. చిననందిపల్లిలో మంగళవారం నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులకు మందులు, సమీకృత దాణాను స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటికే 25 వేల గోకులం షెడ్లు మంజూరు చేశామని, అదనంగా మరో 25 వేల గోకులం షెడ్ల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. అనకాపల్లి జిల్లాలో 230 పశువులు చనిపోగా 173 పశువులకు రూ. 52.5 లక్షల బీమా సొమ్మును రైతులకు చెల్లించామన్నారు. జిల్లా పశువైద్యాధికారి డా.బి.మోహన్‌రావు, డివిజినల్ డిప్యూటీ డైరెక్టర్ డా.ఎం.చంద్రశేఖర్, కె.కోటపాడు ఏడీ ఇ.దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌డీసీ అసోసియేషన్ అధ్యక్షునిగా లక్ష్మీనారాయణ



డీఎంహెచ్‌వో రవికుమార్‌ను శాలువాతో సత్కరిస్తున్న నూతన కమిటీ

అనకాపల్లి: ఉమ్మడి విశాఖ జిల్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో లోయర్ డివిజనల్ క్లర్క్ అసోసియేషన్ అధ్యక్షునిగా సయ్యపురెడ్డి లక్ష్మీనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి ఆవరణలో డీఎంహెచ్‌వో కార్యాలయంలో మంగళవారం జరిగిన ఎన్నికల్లో జిల్లా కార్యదర్శి జె.వి.శేఖర్, కోశాధికారి పి.జనార్దన్, ఉపాధ్యక్షురాలు కె.వి.పద్మావతితోపాటు మరో ఐదుగురు కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ కమిటీ పదవీ కాలం ఏడాదిపాటు ఉంటుందని అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ చెప్పారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు డీఎంహెచ్‌వో పడాల రవికుమార్‌ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు.

ఖైదీల తరలింపు ప్రక్రియ ప్రారంభం

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలోని ఖైదీలను వేరే జైలుకు తరలించే ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. ఇది వారం రోజులపాటు కొనసాగనుంది. ఇక్కడ సామర్థ్యానికి మించి ఖైదీలు ఉండటంతో పరిపాలన సౌలభ్యంలో భాగంగా 200 మందిని రాజమహేంద్రవరం జైలుకు తరలించాలని రాష్ట్ర జైళ్ల శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా విశాఖ పోలీసుల ఎస్కార్టుతో మంగళవారం 20 మంది ఖైదీలను రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి వ్యాన్‌లో తరలించినట్లు జైల్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఎస్.సాయిప్రవీణ్ తెలిపారు.

చెదిరిన మెడికల

కళాశాలలో విద్యార్థులకు వైద్య విద్య.. అనుబంధ బోధనాస్పత్రిలో రోగులకు సూపర్ స్పెషాలిటీ సేవలు.. ఇలా ప్రతి జిల్లాకూ అత్యున్నత ఆరోగ్య వరాన్ని అందివ్వాలన్న కల కరిగిపోయింది.. జిల్లాలోని మాకవరపాలెం మండలం భీమబోయినపాలెంలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి మొదలు కావలసిన మెడికల్ కాలేజీ ఎక్కడిదక్కడే నిలిచిపోయింది. అన్నీ అనుకున్నట్టు జరిగితే ఈ ఏడాది జూలై, ఆగస్టు నెలల్లో మొదటి బ్యాచ్‌కు తరగతులు ప్రారంభమయ్యేవి. ఈపాటికి కాలేజీ, బోధనాస్పత్రి భవనాలు తుది మెరుగులు దిద్దుకునేవి. వైద్యులు, సిబ్బంది నియామకాలు జరిగి, వైద్య పరికరాలు సమకూర్చి, శ్రీకారానికి సర్వం సిద్ధమై ఉండేది. కానీ కూటమి ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలతో విద్యార్థులు, రోగుల మధుర స్వప్నం భగ్నమైంది.



మధ్యలో నిలిచిన మెడికల్ కళాశాల

- మాకవరపాలెం మండలంలో నిలిచిన వైద్య కళాశాల నిర్మాణం
- గత ప్రభుత్వంలో సగం పనులు పూర్తి
- ఈ ఏడాది నుంచి మొదలు కావలసిన అడ్మిషన్లు
- నిర్మాణ పనులను గాలికి వదిలేసిన కూటమి సర్కారు



మెడికల్ కళాశాల నమూనా



నర్సీపట్నం:

సామాన్య ప్రజలకు **మెరుగైన వైద్య సేవలు** అందించేందుకు మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి వైద్య విప్లవానికి నాంది పలికారు. గ్రామీణ ప్రాంతాల్లో జిల్లాకో మెడికల్ కళాశాలల నిర్మాణానికి పెద్దపీట వేశారు. అనకాపల్లి జిల్లాకు సంబంధించి నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలెం మండలం భీమబోయినపాలెంలో మెడికల్ కళాశాల నిర్మాణానికి స్వయంగా శంకుస్థాపన చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ కాలంలో సగం పనులు పూర్తయ్యాయి. జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయంతో వైద్య విద్యతో పాటు ఆధునాతన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని గ్రామీణ ప్రజలు ఆశించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావస్తున్నా మెడికల్ కళాశాల నిర్మాణ పనుల్లో ఎలాంటి పురోగతి లేదు. వేలాది మంది ప్రజలకు దోహదపడే మెడికల్ కళాశాల నిర్మాణ పనులను కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసింది. ప్రభుత్వం మారిన తర్వాత పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి.

రూ.500 కోట్లు మంజూరు

భీమబోయిపాలెంలో 52.15 ఎకరాల్లో రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణం చేపట్టారు. ఏపీ వైద్య సేవల మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ) ఇంజినీర్ల పర్యవేక్షణలో నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ వారు పనులు చేపట్టారు. 12 నెలల్లో మెడికల్ కళాశాలను అందుబాటులోకి తెచ్చేందుకు రాత్రింబవళ్లు పనులు చేశారు. 630 పడకలతో వైద్యసేవలు, 150 మంది విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించడానికి వీలుగా మెడికల్ కళాశాల నిర్మాణ పనులు చేపట్టారు. ప్రభుత్వం మారడంతో ఈ సదాశయానికి గ్రహణం పట్టింది. మెడికల్ కళాశాల నిర్మాణంతో విశాఖ కేజీహెచ్‌కు వెళ్లే బాధ తప్పుతుందని గ్రామీణ ప్రజలు సంతోషించారు. ప్రజల ఆశలపై కూటమి ప్రభుత్వం నీళ్లు చల్లింది. అధికారంలోకి వచ్చి ఏడు గడుస్తున్నా పనుల్లో పురోగతి లేదు. ప్రభుత్వ నిర్వాకంతో మెడికల్ కళాశాల నిర్మాణంపై ఈ ప్రాంత వాసుల్లో ఆశలు సన్నగిల్లుతున్నాయి. కూటమి ప్రభుత్వం ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తి చేయాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

వైద్య కళాశాల ఏర్పాటైతే..

మెడికల్ కాలేజీ.. దానికి అనుబంధంగా బోధనాస్పత్రి ప్రారంభిస్తే వైద్య రంగంలోని అనేక విభాగాల్లో అత్యున్నత వైద్యం అందేది. ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పర్యవేక్షణలో సేవలు లభించేవి. కేజీహెచ్‌కు వెళ్లే అవసరం లేకుండా ఇక్కడే అన్ని రకాల వ్యాధులకు చికిత్స దొరికేది. ఎమర్జెన్సీ, క్యాజువాలిటీ, డయాగ్నోస్టిక్స్, ఆల్ క్లినికల్ ఏపీడీ విభాగాలతోపాటు ఈ కింది సదుపాయాలు అందుబాటులోకి వచ్చేవి.

ఆపరేషన్ థియేటర్లు : మెటర్నిటీ-2, మేజర్ థియేటర్లు-8

ఐసీయూ సేవలు: ఎన్ఐసీయూ-16, ఎస్ఐసీయూ-16, ఎంఐసీయూ-16, గైనె ఐసీయూ-5, హెచ్‌డీయూ-5, పీఐసీయూ-5, ఎంఎన్‌సీయూ-14, ఆర్ఐసీయూ-5, బర్న్ వార్డు-5, ఐసీసీయూ-6, డయాలసిస్ యూనిట్లు-18.

బెడ్స్ వివరాలు: జనరల్ మెడిసిన్-130, జనరల్ సర్జరీ-130, పీడియాట్రిక్స్-75, ఆర్థోపెడిక్-75, గైనికాలజీ-100, ఆప్తమాలజీ-20, సైకియాట్రిక్స్-20, రినోలారిన్జాలజీ-20, టీబీ-20, డెర్మటాలజీ-10, ఎమర్జెన్సీ మెడిసిన్-30

విద్యార్థులకు మేలు చేకూరేది..



మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తయితే ఎంతో మంది విద్యార్థులకు వైద్య విద్య అందుబాటులోకి వచ్చేది. వైద్య విద్యను మరింత చేరువ చేసేందుకు గత ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది. కాలేజీకి అనుబంధంగా ఏర్పాటు చేసే బోధనాస్పత్రి వల్ల జిల్లా ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందుబాటులోకి వచ్చేది. కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాల నిర్మాణాన్ని వదిలేసింది. అదే గత ప్రభుత్వం ఉండుంటే ఈ పాటికి ఆశలు నెరవేరేవి. అసంపూర్తిగా ఉన్న మెడికల్ కళాశాలను అందుబాటులోకి తేవాలి

– గీతా కృష్ణ, డీవైఎఫ్ఐ ప్రతినిధి

మెడికల్ కళాశాల వరం



ఈ ప్రాంతానికి మెడికల్ కళాశాల రావడం ఒక వరం. మెడికల్ కళాశాల పూర్తయితే వైద్య విద్యతోపాటు గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయి. అనారోగ్యం బారిన పడిన పేద ప్రజలు వంద కి.మీ. దూరంలో ఉన్న కేజీహెచ్‌కు వెళ్లాల్సి వస్తోంది. మెడికల్ కళాశాల అందుబాటులోకి వస్తే విశాఖ వెళ్లే అవరం ఉండదు. గత సర్కారు మంచి ఆలోచనతో కళాశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని రాజకీయాలకు అతీతంగా మంచి ఆశయాన్ని కొనసాగించాలి.

– అడిగర్ల రాజు, సీఐటీయూ నాయకుడు

భారీ ఎత్తున గంజాయి ధ్వంసం

- రూ.17.6 కోట్ల విలువైన 35 వేల కిలోల సరకు దహనం
- 39 కేజీల హాష్ ఆయిల్ కూడా..
- హాజరైన డీజీపీ ద్వారకా తిరుమలరావు, ఈగల్ ఐజీ రవికృష్ణ



డివిజన్ల వారీగా పట్టుబడిన 35 వేల కిలోల గంజాయి



బటన్ నొక్కి గంజాయిని ధ్వంసం చేస్తున్న డీజీపీ ద్వారక తిరుమలరావు, ఎస్పీ తుహిన్ సిన్హా, చిత్రంలో డీఐజీ గోపీనాథ్ జెట్టి, ఈగల్ ఐజీ రవికృష్ణ

సాక్షి, అనకాపల్లి: జిల్లాలో గత నాలుగేళ్లుగా పట్టుబడిన గంజాయిని డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో పోలీసులు ధ్వంసం చేశారు. మంగళవారం పరవాడ జేఎస్ ఫార్మాలో కోస్టల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు వద్ద జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్, ఎస్పీ తుహిన్ సిన్హా ఆధ్వర్యంలో జిల్లాలో పట్టుబడిన రూ.17.6 కోట్ల విలువైన 35 వేల కిలోల గంజాయి, 39 కేజీల హాష్ ఆయిల్‌ను ధ్వంసం చేసే కార్యక్రమాన్ని ఇన్సినరేషన్ ద్వారా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డీజీపీ ద్వారకా తిరుమలరావు జిల్లాలో పట్టుబడిన గంజాయిని డివిజన్ల వారీగా సందర్శించారు. అనంతరం మాదక ద్రవ్యాలను ధ్వంసం చేశారు. దఫదఫాలుగా నాలుగు రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఈ సందర్భంగా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ.. ఆర్థిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధానాన్ని అనుసరించి, డీజీపీ ఆదేశాల మేరకు.. జిల్లాలో పట్టుబడిన గంజాయిని దహనం చేస్తున్నామన్నారు. జిల్లాలో మొత్తం 459 కేసుల్లో పట్టుబడిన 35 వేల కిలోల గంజాయి, 39.4 కేజీల హాష్ ఆయిల్ ధ్వంసం చేశామన్నారు. ఈ కేసుల్లో 1304 మందిని అరెస్ట్ చేసి, 205 వాహనాలు సీజ్ చేశామన్నారు. గంజాయి రవాణాను అడ్డుకునేందుకు అనకాపల్లి జిల్లా పోలీసు శాఖ ప్రధాన రవాణా మార్గాలను గుర్తించి 5 శాశ్వత చెక్‌పోస్టులు, 24 డైనమిక్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసిందన్నారు. ఈ చెక్‌పోస్టులు 24 గంటలూ పనిచేయడమే కాకుండా సీసీటీవీ కెమెరాలు, పోలీస్ డాగ్ స్క్వాడ్‌తో గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు పనిచేస్తున్నాయని తెలిపారు. కాలిబాట, ఇతర రవాణా మార్గాలపై గంజాయి రవాణాను నిరోధించడానికి 3 డ్రోన్లను వినియోగిస్తున్నామని, 470 మంది అనుమానితులపై 3 కేడీ షీట్లు, 4 రౌడీ షీట్లు తెరవడం జరిగిందని, 11 మంది అలవాటు పడిన నేరస్థులపై పీడీ యాక్టు ప్రయోగించామన్నారు.

అవగాహన కార్యక్రమాలు

జిల్లాలో 'సంకల్పం' పేరుతో 360 పాఠశాలలు, 156 కళాశాలల్లో మాదక ద్రవ్యాల వల్ల అనర్థాల గురించి అవగాహన కల్పించామని, కళాశాలల్లో 136 యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేసి విద్యార్థులు గంజాయికి బానిసలుగా కాకుండా పర్యవేక్షిస్తున్నామన్నారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో 15 కేసుల్లో 26 మంది నేరస్తులకు 5 నుంచి 20 ఏళ్ల పాటు కఠిన కారాగార శిక్ష పడిందన్నారు. ఈగల్ డైరెక్టర్ ఐజీ ఆకే రవికృష్ణ, డీఐజీ గోపీనాథ్ జెట్టి, కలెక్టర్ విజయ కృష్ణన్, అల్లూరి ఎస్పీ అమిత్ బర్దర్, ఈగల్ ఎస్పీ కె.నగేష్‌బాబు, అదనపు ఎస్పీ కె.ధీరజ్, అనకాపల్లి జిల్లా అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్, అనకాపల్లి ఆర్డీవో షేక్ ఆయిషా, డీఎస్పీలు బి.అప్పారావు, వి.విష్ణుస్వరూప్, పి.శ్రీనివాసరావు, శ్రావణి, ఇ.శ్రీనివాసులు, సీఐ మల్లికార్జునరావు, గణేష్ పాల్గొన్నారు.

నేడు విమానాశ్రయంలో మాక్ డ్రిల్



ఎన్డీఆర్ఎఫ్ ఎగ్జిబిషన్‌లో పరికరాలు, సామగ్రిని పరిశీలిస్తున్న వివిధ శాఖల అధికారులు

మహారాణిపేట: విశాఖ విమానాశ్రయంలో బుధవారం మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో తలెత్తే ఇబ్బందుల్ని దృష్టిలో పెట్టుకుని జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం(ఎన్‌డీఆర్ఎఫ్) ఆధ్వర్యంలో ఈ మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్టు విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. మంగళవారం విమానాశ్రయంలో వివిధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశానికి హాజరై, మాట్లాడారు. ఎన్డీఎంఏ, ఎయిర్ పోర్ట్ అథారిటీ, ఎస్డీఆర్ఎఫ్, సివిల్ డిఫెన్స్, నేవీ, ఫైర్ సర్వీసెస్, పోలీసు, మెడికల్–హెల్త్, పంచాయతీరాజ్ శాఖలు ఈ మాక్ డ్రిల్‌లో పాల్గొంటాయన్నారు.

నేడే అప్పన్న తెప్పోత్సవం

- విజయవంతంగా ట్రయల్‌రన్
- ముస్తాబైన వరాహ పుష్కరిణి



వరాహ పుష్కరిణిలో సిద్ధం చేసిన హంసాకార తెప్పపై ట్రయల్ రన్ నిర్వహిస్తున్న ఎఫ్‌డీవో, దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులు

సింహాచలం: పుష్య బహుళ అమావాస్య సందర్భంగా శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తెప్పోత్సవం(నౌకావిహారం) బుధవారం సాయంత్రం వరాహ పుష్కరిణిలో జరగనుంది. హంసాకారంలో రూపొందించిన తెప్పపై స్వామివారు శ్రీదేవి, భూదేవి సమేతంగా నౌకా విహారం చేయనున్నారు. ఈ మేరకు విశాఖ ఫిషరీస్ డెవలప్‌మెంట్ అధికారి ఆశాజ్యోతి ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ట్రయల్‌రన్ నిర్వహించారు. తెప్ప తీర్చిదిద్దిన తీరు, సామర్థ్యాన్ని పరిశీలించారు. ట్రయల్ రన్‌లో దేవస్థానం ఈఈ రాంబాబు, ఏఈ తాతాజీ పాల్గొన్నారు.

విశేషంగా ఏర్పాట్లు

తెప్పోత్సవ ఏర్పాట్లను దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. హంసాకార తెప్పను పూలు, విద్యుద్దీపాలతో అలంకరిస్తున్నారు. పుష్కరిణి నలువైపులా విద్యుద్దీపకాంతులు ఏర్పాటు చేస్తున్నారు. పుష్కరిణి మధ్యలో స్వామి పూజలందుకునే మండపాన్ని తీర్చిదిద్దారు. పుష్కరిణి గట్టుపై సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. పుష్కరిణి వద్ద 15 మంది గజ ఈతగాళ్లను, రెండు అదనపు బోట్లను, 15 లైఫ్ జాకెట్లను అందుబాటులో ఉంచనున్నట్లు ఆలయ ఈఈ రాంబాబు తెలిపారు. 35 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు గోపాలపట్నం సీఐ గొలగాని అప్పారావు తెలిపారు.

వేణుగోపాల స్వామి అలంకరణలో..

తెప్పోత్సవంలో భాగంగా శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామికి వేణుగోపాలస్వామి అలంకరణ చేసి శ్రీదేవి, భూదేవి సమేతంగా మెట్లమార్గంలో తీసుకొస్తారు. పుష్కరిణి వద్ద హంస వాహనంపై స్వామిని వేంజేపచేసి సాయంత్రం 5 గంటల నుంచి తెప్పోత్సవాన్ని నిర్వహిస్తారు. అనంతరం స్వామిని మండపంలో కొలువుంచి షోడశోపచార పూజలు నిర్వహిస్తారు. పుష్కరిణి సత్రం వద్దకు చేర్చి, సర్వజనమనోరంజని వాహనంపై రాత్రి అడవివరం గ్రామంలో తిరువీధి నిర్వహిస్తారు. అనంతరం స్వామిని తిరిగి సింహగిరికి చేరుస్తారు.

తండేల్ కలెక్షన్లు దుల్లకొట్టేయాలి



8లో



యలమంచిలిలో వైఎస్సార్ కూడలి వద్ద విద్యార్థుల మానవహారం

ఎన్నాళ్లీ కీచక రాజ్యం?

- బాలికలపై అఘాయిత్యాలు అరికట్టండి
- లైంగిక దాడులపై కదం తొక్కిన విద్యార్థి లోకం

యలమంచిలి రూరల్: రాష్ట్రంలో వరుసగా మహిళలు, బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులను పకడ్బందీగా అరికట్టాలని డిమాండ్ చేస్తూ మంగళవారం యలమంచిలి పట్టణంలో వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. పట్టణానికి చెందిన 13 ఏళ్ల బాలికపై 27 ఏళ్ల సీనియర్ హాకీ క్రీడాకారుడు మళ్ల రూపేష్ లైంగిక దాడికి పాల్పడిన ఘటనను ఖండిస్తూ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో వైఎస్సార్ కూడలి నుంచి పాత ప్రభుత్వాస్పత్రి వరకు ర్యాలీ చేసిన తర్వాత కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కె.వరహాలుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ నాయకులు చింతకాయల శివాజీ, ఎం.రమణ మాట్లాడుతూ **రాష్ట్రంలో నిత్యం ఏదో ఒక చోట బాలికలపై అఘాయిత్యాలు జరగడం దారుణమన్నారు. ముఖ్యం**గా గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, అమ్మకాలు, వినియోగం, ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉంటున్న పోర్న్ వీడియోల ప్రభావంతో అత్యాచారాలు, దౌర్జన్యాలు మరింత ఎక్కువ అవుతున్నాయని, ఈ పరిస్థితిని ప్రభుత్వం వెంటనే చక్కదిద్దాలన్నారు. నిందితుడు మళ్ల రూపేష్‌ను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని, దీనికోసం ఈ కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. బాధిత బాలిక కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఆ బాలిక చదువు బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలన్నారు. **కూటమి ప్రభుత్వ హ**యాంలో మద్యం బెల్టు **షాపులు విచ్చలవిడిగా** నడుస్తున్నాయని వీటిని **నియంత్రించడంలో** ప్రభుత్వం ఘోరంగా విఫల**మైందన్నారు. రైతు సం**ఘం జిల్లా అధ్యక్షుడు కర్రి **అప్పారావు, ఎస్ఎఫ్ఐ** జిల్లా అధ్యక్షుడు ఎం**.బాలాజీ, ఐద్వా జిల్లా** ఉపాధ్యక్షురాలు ఆర్.లక్ష్మి, **యలమంచిలి డివిజన్** కార్యదర్శి సీహెచ్ మంగ, **ఎస్ఎఫ్ఐ నాయకులు** అభి, లక్ష్మణ్, సునీల్, **రాము, కృప పాల్గొన్నా**రు.



ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

హాకీ సంఘం నుంచి పోక్సో కేసు నిందితుడి తొలగింపు



రాజీవ్ క్రీడా మైదానంలో మీడియాతో మాట్లాడుతున్న హాకీ అసోసియేషన్ ప్రతినిధులు

యలమంచిలి రూరల్: పదమూడేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడిగా ఉన్న సీనియర్ హాకీ క్రీడాకారుడు మళ్ల రూపేష్‌ను జిల్లా హాకీ అసోసియేషన్ నుంచి శాశ్వతంగా తొలగించినట్టు సంఘం కార్యదర్శి కొఠారు నరేష్ తెలిపారు. మంగళవారం సాయంత్రం యలమంచిలి రాజీవ్ క్రీడా మైదానంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ విషయాన్ని ఆయన వెల్లడించారు. రాష్ట్ర హాకీ అసోసియేషన్ ప్రతినిధుల ఆదేశాలతో జిల్లా హాకీ సంఘం అత్యవసర సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. హాకీ క్రీడాకారిణిపై లైంగిక దాడికి పాల్పడిన దారుణ ఘటనను తామంతా ఖండిస్తున్నామన్నారు. ఇటువంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకుంటామన్నారు. బాధిత బాలికకు జిల్లా హాకీ సంఘం అన్నివిధాలా అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా హాకీ సంఘం ఉపాధ్యక్షుడు రాంబాబు, రాజా పలువురు సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు పాయకరావుపేటలో జాబ్‌మేళా

అనకాపల్లి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 30న పాయకరావుపేటలోని ప్రభుత్వ ఐటీఐ ఆవరణలో ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎస్.గోవిందరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 4 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ వరకు చదువుకున్న 18–25 సంవత్సరాల మధ్య వయసున్న యువతీ యువకులు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 9640138565 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

జైల్లో కొత్త బ్యాచ్‌లకు చేతి వృత్తుల్లో శిక్షణ

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో ఖైదీలకు వివిధ చేతి వృత్తుల్లో శిక్షణ ఇస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 25న రెండు వృత్తుల్లో శిక్షణ పొందిన బ్యాచ్‌లకు పరీక్షలు జరిగాయి. మరో రెండు, మూడు రోజుల్లో కొత్త బ్యాచ్‌లు ప్రారంభంకానున్నట్లు జైల్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఎస్.సాయిప్రవీణ్ తెలిపారు. ఇక్కడ ప్లంబింగ్, వెల్డింగ్ కోర్సుల్లో 40 మంది చొప్పున రిమాండ్ ఖైదీలకు రెండు నెలలు పాటు శిక్షణ అందించామన్నారు. శిక్షణ పొంది, పరీక్షలు రాసిన వారికి సర్టిఫికెట్లు కూడా అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆ సర్టిఫికెట్లు బాహ్య ప్రపంచంలో వారికి చేతి వృత్తుల్లో ఉపయోగపడతాయన్నారు.

మేజర్ పోర్ట్స్ క్యారమ్ పోటీలు ప్రారంభం

విశాఖ స్పోర్ట్స్: విశాఖ పోర్ట్ అథారిటీ(వీపీఏ) ఆధ్వర్యంలో ఆల్ ఇండియా మేజర్ పోర్ట్స్ క్యారమ్ చాంపియన్‌షిప్ మంగళవారం ప్రారంభమైంది. మూడురోజుల పాటు జరగనున్న ఈ పోటీల్లో ముంబై, దీన్‌దయాళ్, కోల్‌కతా, చెన్నై, పారాదీప్, జెఎన్, న్యూమంగళూర్, కామరాజార్, ఆతిథ్య విశాఖ పోర్టుతో సహా తొమ్మిది మేజర్ పోర్టు జట్లు పోటీపడనున్నాయి. పోర్ట్ ఇండోర్ స్టేడియంలో వీపీఏ డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబే పోటీలను ప్రారంభించారు. విశాఖకు చెందిన అంతర్జాతీయ ఆటగాడు జనార్దన్‌రెడ్డితో కాసేపు క్యారమ్ ఆడారు.

అట్టహాసంగా స్పోర్ట్స్ మీట్



ఉత్సాహంగా బాలుర పరుగు పోటీ

- పాలిటెక్నిక్స్ పోటీలకు 13 జిల్లాల క్రీడాకారులు
- అథ్లెటిక్స్‌తో పాటు ఆరు క్రీడాంశాల్లో పోటీ



శాంతికపోతాలను గాల్లో విడిచి మీట్ ప్రారంభిస్తున్న అతిథులు

విశాఖ స్పోర్ట్స్ : కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో నిర్వహిస్తున్న 27వ ఇంటర్ పాలిటెక్నిక్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ ఘనంగా ప్రారంభమైంది. రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన 720 మంది బాలురు, 510 మంది బాలికలు అథ్లెటిక్స్‌తో పాటు ఆరు క్రీడాంశాల్లో పోటీపడనున్నారు. వాలీబాల్, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, బ్యాడ్మింటన్, టీటీ, చదరంగంతో పాటు అథ్లెటిక్స్ ట్రాక్, ఫీల్డ్ అంశాల్లోనూ మూడు రోజుల పాటు జరిగే ఈపోటీలో 138 ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్స్‌కు చెందిన విద్యార్థులు ప్రాంతీయ జట్లుగా తలపడనున్నారు. ఆయా జట్ల సభ్యుల నుంచి అతిథులు గౌరవవందనాన్ని స్వీకరించారు. డిఫెండింగ్ చాంప్ కృష్ణా జట్టు నుంచి ఆతిథ్య జట్టు విశాఖతో సహా 13 రీజియన్ జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. కృష్ణా జట్టుకు జయకుమార్, అనంతపురానికి మహేష్, చిత్తూర్‌కు గిరిబాబు, తూర్పుగోదావరికి చిరంజీవి, గుంటూరుకు దేముడు, కడపకు హేమంత్‌రెడ్డి, కర్నూలుకు త్రిమూర్తి, నెల్లూరుకు తరుణి, ప్రకాశంకు నిఖిల్, శ్రీకాకుళానికి శివరామకృష్ణ, విజయనగరానికి లక్ష్మి, పశ్చిమగోదావరి జట్టుకు అవినాష్, విశాఖ జట్టుకు హేమంత్ కంటింజెంట్ లీడర్‌గా వ్యవహరించారు. క్రీడా జ్యోతి వెలిగించిన అనంతరం ఆయా జట్ల కెప్టెన్లు ప్రతిజ్ఞ చేశారు. అతిథులు శాంతికపోతాలను గాల్లోకి విడవగా ముఖ్యఅతిథి మీట్ ప్రారంభాన్ని ప్రకటించారు. గేమ్స్ బాలుర విభాగంలో అప్పర్‌పూల్‌లోని అనంతపురం రీజియన్‌తో కర్నూలు రీజియన్ జట్ల మధ్య వాలీబాల్‌పోటీని... అథ్లెటిక్స్ ట్రాక్ ఈవెంట్‌లో భాగంగా బాలబాలికలకు 800 మీటర్ల పరుగును ప్రారంభించారు. అథ్లెటిక్స్‌లో బాలబాలికలకు స్ప్రింట్ అంశాలతో పాటు 800 మీటర్ల పరుగు, జంప్స్, త్రోస్ నిర్వహించనుండగా బాలురకు 1,500 మీటర్ల పరుగు, వంద, 400 మీటర్ల రిలే పరుగును నిర్వహించనున్నారు.

క్రీడలతో ఆరోగ్యం

క్రీడాపోటీలను పోటీలను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.రఘువర్మ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. భారత్ శక్తి యువతేనని, సాంకేతికతను అందిపుచ్చుకుని మరింత ముందుకు సాగాలని సూచించారు. గౌరవ అతిథిగా హాజరైన సాంకేతిక విద్య సంయుక్త సంచాలకుడు వి.పద్మారావు మాట్లాడుతూ ఏటా ఒక్కో రీజియన్‌లో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. గతేడాది అనంతపురంలో నిర్వహిస్తే ఈసారి విశాఖలో నిర్వహిస్తున్నామని చెప్పారు. పోటీల్లో విజేతలు దక్షిణ భారతంలోని అంతర రాష్ట్ర పాలిటెక్నిక్ ఆటల పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. తొలుత విశాఖ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ నారాయణరావు మాట్లాడుతూ క్రీడలంటే గెలుపోటములే కాదని ఓటమిలోనూ పాఠం నేర్చుకోవడమే అన్నారు. కాకినాడ, తిరుపతి ప్రాంతాయ సంయుక్త సంచాలకులు సత్యనారాయణ, నిర్మల కుమార్ ప్రియ, సాంకేతిక విద్య, శిక్షణ మండలి కార్యదర్శి జీవీ రామచంద్రరావు, డిప్యూటీ డైరెక్టర్ విజయ భాస్కర్, సాంకేతిక విద్యాశాఖ ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంటు డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎంఏవీ రామకృష్ణ, స్పోర్ట్స్ మీట్ సహ సమన్వయాధికారి డాక్టర్ బి.జానకీరామ్, వివిధ కాలేజీల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.



నువ్వా నేనా అన్నట్టు బాలికల పరుగు పోటీ



అనంతపురం, కర్నూల్ జట్ల మధ్య హోరాహోరీగా వాలీబాల్

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం ఉధృతం

- మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు ప్రొఫెసర్ వి.ఎల్.రాజు

పాయకరావుపేట :

ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా పోరాటం ఉధృతం చేయాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు ప్రొఫెసర్ డాక్టర్ వి.ఎల్. రాజు మాలలకు పిలుపు ఇచ్చారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ నగర్‌లో పరివర్తన నిలయంలో జరిగిన మాల మహానాడు రాష్ట్ర నాయకులు సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఎస్సీ వర్గీకరణ చేయడానికి మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్, ఎన్డీఏ సర్కార్‌లు ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ జరిగితే మాల, మాదిగ, రెల్లీలతో పాటు ఎస్సీ జాబితా లోని 59 కులాలకు విద్య, ఉద్యోగం, ఇతర సామాజిక రంగాల్లో నష్టం జరుగుతుందన్నారు.

ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ ఇచ్చిన నివేదికను అమలు చేయవద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ క్రిమిలేయర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి నెలాఖరులో పాయకరావుపేటలో మాలల సమర భేరి, ప్రదర్శన ఆందోళన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ప్రకటించారు. ఈ సందర్భంగా మాల మహానాడు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శిగా గొడిచెర్ల గ్రామానికి చెందిన బిందడి రాజేష్‌ను నియమిస్తూ నియామకం ఉత్తరువును అందజేశారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పులి పాండురాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మీలా గోపి, దాసరి రామచంద్రరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి బోడపాటి రమణబాబు, అనకాపల్లి జిల్లా శాఖ అధ్యక్షుడు తట్టా శ్రీనివాసరావు, పాయకరావుపేట అసెంబ్లీ ఇంచార్జ్ బడుగు అచ్చారావు పాల్గొన్నారు.

మోసపూరిత సర్కారుకు మంగళం

- 8 నెలల పాలన చూశాక ఇదే ప్రజల అభిమతం
- వైఎస్సార్ సీపీ వస్తేనే మళ్లీ మంచి రోజులు
- చిక్కాల జన్మదిన వేడుకలో మాజీ మంత్రులు అమర్‌నాథ్, కన్నబాబు



చిక్కాల రామారావు జన్మదిన వేడుకలో కేక్‌ను కట్ చేస్తున్న మాజీ మంత్రులు అమర్‌నాథ్, కన్నబాబు

పాయకరావుపేట: గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కూటమి నాయకులు రాష్ట్ర ప్రజల్ని మోసం చేశారని, 8 నెలలు పూర్తి కాకుండానే ఈ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పోయిందని రాష్ట్ర మాజీ మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, కురసాల కన్నబాబు అన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు జన్మదిన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. సంపద సృష్టించి, రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానన్న చంద్రబాబు దానిని సాధించలేదు సరికదా ఉన్న సంక్షేమ పథకాలు నిలిపేసి, ఆ సొమ్ముతో షికార్లు చేస్తున్నాడన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి టీడీపీ, జనసేన నాయకులు అవినీతికి పాల్పడుతూ స్వంత ప్రయోజనాలకు సంపద సృష్టించుకుంటున్నారన్నారు. స్థానికేతరులను పార్లమెంట్ సభ్యుడిగా గెలిపించినందుకు కొండల్ని పిండి చేసి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నాడన్నారు. అక్రమ సంపాదన కోసం అనకాపల్లి, చోడవరం, రాంబిల్లి ప్రాంతాల్లో టోల్‌గేట్లు కూడా ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్ర ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డి పాలన కోసం ఎదురుచూస్తున్నారన్నారు. నాయకులు పుట్టినరోజు వేడుకలు చేసుకోవడం కార్యకర్తలను ఒక చోటికి చేర్చి పార్టీ అభివృద్ధి కోసం ఉత్తేజపరచడం కోసమేనన్నారు. స్నేహశీలిగా పేరొందిన చిక్కాల రామారావు కుటుంబం మొదటి నుంచి సమాజసేవకు అంకితమైందన్నారు.

త్వరలో వైఎస్ జగన్ జిల్లాల వారీ సమావేశాలు

పార్టీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం ధర్మశ్రీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్‌లు మాట్లాడుతూ త్వరలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలవారీగా కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేసి, నియోజకవర్గ సమస్యలపై దృష్టి పెడతారన్నారు. రాష్ట్రంలో సంక్షేమం కుంటుపడిందని, మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాకే జనానికి మంచి రోజులు వస్తాయన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు, మాజీ ఎమ్మెల్సీలు డీవీ సూర్యనారాయణ రాజు, అంగూరి లక్ష్మీశివకుమారి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనపై రాష్ట్ర ప్రజల్లో అసంతృప్తి నెలకొందన్నారు. అతిథులందరూ కేక్ కట్ చేసి, చిక్కాల రామారావుకు అందించారు. ఈ సందర్భంగా చిక్కాల రామారావు మాట్లాడుతూ తనను అభిమానించి, ఆదరించినవారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

జెడ్పీటీసీ లంక సూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, పార్టీ జిల్లా ప్రచార విభాగం మాజీ అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, సీనియర్ నాయకుడు ధనిశెట్టి బాబూరావు, కోటవురట్ల మాజీ మండల అధ్యక్షుడు పైలా రమేష్, నక్కపల్లి మండల అధ్యక్షుడు సీరం నర్సింహమూర్తి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు దేవవరపు రాజేష్ కన్నా, సూరకాసులు గోవిందు, పాయకరావుపేట ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, పార్టీ టౌన్ అధ్యక్షుడు ధనిశెట్టి మహేష్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని చిక్కాల రామారావును పూలదండలు, శాలువాలు వేసి అభినందించారు.

వైఎస్సార్ సీపీ సమావేశం ఏర్పాట్ల పరిశీలన



కశింకోటలో వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం ఏర్పాట్లు పరిశీలిస్తున్న అమర్‌నాథ్, ధర్మశ్రీ తదితరులు

కశింకోట: కశింకోటలో ఈనెల 31న వైఎస్సార్ సీపీ జిల్లా స్థాయి పార్లమెంటరీ పార్టీ సమావేశం జరగనున్న సరోజిని విల్లాలో ఏర్పాట్లను చోడవరం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త గుడివాడ అమర్‌నాథ్ పరిశీలించారు. అనకాపల్లి పార్లమెంటరీ పార్టీ పరిశీలకుడు కరణం ధర్మశ్రీతో కలిసి పార్టీ ప్రతినిధులకు మంగళవారం పలు సూచనలు, సలహాలు చేశారు. పార్టీ శ్రేణులు, అభిమానులు, స్థానిక ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరుకావాలని కోరారు. పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, అనకాపల్లి పట్టణ పార్టీ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, 84వ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ, యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కుకు సొంతగనులు కేటాయించకుండా నాటకాలు

- సిటూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు



ఉద్యమ జ్యోతితో సిటూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు, ఉద్యమ నాయకులు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షిస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిస్తున్నప్పటికీ సొంత గనులు కేటాయించకుండా వాటి ప్రాధాన్యతను తగ్గిస్తూ మాట దాట వేస్తున్నారని సిటూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నర్సింగరావు ఆరోపించారు. విశాఖ ఉక్కు రిలే దీక్షా శిబిరం నుంచి ఉద్యమ జ్యోతిని సీపీఎం రాష్ట్ర మహాసభల్లో ప్రదర్శనకు తీసుకువెళ్లే కార్యక్రమం కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకా ప్రారంభం కాని ప్రైవేటు ఉక్కు కర్మాగారానికి సొంత గనులు కేటాయించాలని ప్రధాన మంత్రిని కోరుతున్న ముఖ్యమంత్రి లక్షల మందికి ఉపాధి కల్పించి, రాష్ట్రానికి మణిపూసగా ఉన్న విశాఖ ఉక్కు విషయంలో ఎందుకు నిర్లక్ష్య ధోరణి కనబర్చుతున్నారని ప్రశ్నించారు. ప్యాకేజీ పేరుతో పక్కదోవ పట్టించి ప్రజలను నమ్మించి మోసం చేస్తున్నారని ఆరోపించారు. దీనిని గమనించి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లోకనాథం మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం అనేక ఉద్యమాలు జరిగాయని, వాటిని కాపాడుకోడానికి కూడా సంఘటిత ఉద్యమాలు చేయాల్సి వస్తుండడం దారుణమన్నారు.

తండేల్ కలెక్షన్లు దుల్లగొట్టేయాలి



మాట్లాడుతున్న హీరో నాగచైతన్య

సీతంపేట(విశాఖ): విశాఖలో తండేల్ చిత్ర యూనిట్ సందడి చేసింది. చిత్రం ట్రైలర్‌ను రామాటాకీస్ హాల్లో హీరో నాగచైతన్య, చిత్ర సమర్పకుడు, ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్, దర్శకుడు చందు మొండేటి లాంచ్ చేశారు. ఈ సందర్భంగా నాగచైతన్య మాట్లాడుతూ విశాఖ హార్బర్ పరిసరాల్లో చిత్ర షూటింగ్ జరిగిందని, విశాఖలో ట్రైలర్ లాంచ్ చేయడం ఆనందంగా ఉందని చెప్పారు. ఏ సినిమా అయినా విశాఖలో టాక్‌బట్టే భవితవ్యం తేలిపోతుందన్నారు. విశాఖ అమ్మాయినే ప్రేమించి పెళ్లి చేసుకున్నా..తండేల్ సినిమా కలెక్షన్లు దుల్లకొట్టేయాలి అంటూ అభిమానులద్దేశించి అన్నారు. ఇప్పటికే విడులైన పాటలు చార్ట్ బస్టర్‌గా నిలిచాయని, దేవిశ్రీ అద్భుత బాణీలు అందించాడన్నారు. ఏడాదిన్నరగా తాను కూడా చైతూ జపం చేస్తున్నానని అల్లు అరవింద్ అన్నారు. చాలా కష్టపడి సినిమా తీశాం. ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చుతుందన్నారు.

స్వీయ రక్షణ సంస్థల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

విశాఖ విద్య: జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి వరకు చదువుకునే విద్యార్థినులకు కరాటే, తైక్వాండో వంటి స్వీయరక్షణ అంశాల్లో శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేసినట్లు సమగ్ర శిక్ష ఏపీసీ చంద్రశేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందు కోసం అర్హత గల శిక్షణ సంస్థలు ఈ నెల 30 సాయంత్రం 5 గంటల్లోపు సమగ్ర శిక్ష కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాల్సిందిగా కోరారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు



తప్పిపోయిన మహిళ గుర్రం నూకరత్నం

పాయకరావుపేట : పట్టణానికి చెందిన గుర్రం నూకరత్నం (49) అనే మహిళ రైలు ప్రయాణంలో తప్పిపోవడంతో గాలిస్తున్నట్టు తుని రైల్వే పోలీసు స్టేషన్ ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. నూకరత్నం ఈ నెల 25వ తేదీన తుని రైల్వేస్టేషన్‌లో సామర్లకోట వెళ్లడానికి రత్నాచల్ రైలు ఎక్కిందన్నారు. నూకరత్నం పాయకరావుపేటలో గల తల్లిదండ్రుల ఇంటికి పండగకు వచ్చి తిరిగి ఆమె స్వస్థలం సామరట్లకోట బయలుదేరింది. అయితే ఆమె ఇంటికి చేరుకోకపోవడంతో నూకరత్నం సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తులు అరెస్టు





మద్యంతో పట్టుబడిన వ్యక్తితో ఎక్సైజ్ పోలీసులు

నర్సీపట్నం : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామని ఎక్సైజ్ సీఐ కె.సునీల్ కుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు నర్సీపట్నం మండలం, నెల్లిమెట్ట, మాకవరపాలెం మండలం, తామరంలో ప్రాంతాల్లో మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశామని, వారి వద్ద నుండి 18 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. వైన్‌షాపుల నిర్వాహకులు అక్రమ మద్యం అమ్మకాలను ప్రోత్సహిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ కిరణ్‌కుమార్, కానిస్టేబుల్ నారాయణ, బాబురావు, గోవర్ధన్ పాల్గొన్నట్టు సీఐ తెలిపారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి రూ.50 వేల కోట్ల ప్యాకేజీ ఇవ్వాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు లోకనాథం
- 1 తేదీ నుంచి నెల్లూరులో సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలు



సీపీఎం 27వ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న లోకనాథం

అనకాపల్లి : ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.50వేల కోట్ల ప్యాకేజీ తక్షణమే ప్రకటించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.లోకనాథం అన్నారు. స్థానిక దొడ్డిరామునాయుడు భవనంలో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో నెల్లూరులో సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలు జరగనున్నాయని, ఈ మహాసభల్లో ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధిపై చర్చించనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విభజన హామీల్లో ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఇవ్వాల్సిన నిధులు కేటాయింపు చేయలేదని, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులు ప్రారంభం చేయకపోడంతో ఉత్తరాంధ్రలో ఎనిమిదిన్నర లక్షల ఎకరాల భూములకు సాగునీరు లేకుండా పోయిందని అన్నారు. 2047 విజన్ పేరుతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర చేస్తామని చెబుతున్నారని, కానీ ఆచరణలో రానున్న కాలంలో ఉత్తరాంధ్రను శ్మశాన దిబ్బగా మార్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటుపరం కాకుండా చూస్తామని, ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ పరిశ్రమ ప్రారంభం కాకుండానే మిట్టల్ స్టీల్ కంపెనీకి ఎంపీఎండీసీలో ఐరన్ ఓర్‌కి ఒప్పందం చేశారని, ప్రభుత్వ రంగ పరిశ్రమ స్టీల్‌ప్లాంట్‌కు మాత్రం గనులు ఇవ్వడం లేదన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, గంటా శ్రీరామ్, ఎం.అప్పలరాజు, ఆర్.శంకరరావు. గనిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

డెయిరీ అక్రమాలపై విచారణ జరపాలి

విశాఖ డెయిరీలో అక్రమాలపై విచారణ జరిపించాలని, యాజమాన్యం తగ్గించిన ఆవు పాల ధర రూ.4 పునరుద్ధరించాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గదర్శి సభ్యుడు కె.లోకనాథం అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో మంగళవారం జరిగిన పార్టీ జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కంపెనీ చట్టం నుంచి సహకార చట్టంలోకి తీసుకురావాలని ఆయన కోరారు. జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ వందల కోట్ల సహకార విశాఖ డెయిరీ ఆస్తులను ప్రైవేట్ ఆస్తులుగా మార్చుకోవడం, సేకరణ ధర తగ్గించి పాల రైతులకు నష్టం చేయడం, విచ్చలవిడిగా డెయిరీ ఆస్తులను కుటుంబ సభ్యుల పేరుతో ఉన్న ట్రస్టుకు బదిలీ చేయడం వంటి అక్రమాలకు డెయిరీ యాజమాన్యం పాల్పడుతోందని ఆరోపించారు.



సాక్షి క్లాసిఫైడ్స్

Services

BUSINESS OFFER

■ మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబి డైపర్ మెషిన్, ప్లాస్టిగ్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర॥ 8376001873, 9643010487, 8376089771, 011-25920179 [DA-6200]

■ చెదలు, బొద్దింకలు సమస్యలా ? పేస్ట్‌క్యూర్ సొల్యూషన్, సంప్రదించండి: ఫోన్ : 9505914870 [HA-39805]

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 13197]

Wanted

■ కేర్‌టేకర్స్, నర్సులు కావలెను. విజయవాడలో పేషెంట్లను ఇళ్ళ వద్దనే ఉండి చూసుకొనుటకు ప్రముఖ హోమ్‌కేర్ సంస్థకు కావలెను. మంచి జీతం+వ+ భో ✆ 91608 35559, 78158 35561 [B-431]

■ ప్రముఖ వ్యాపార సంస్థ యందు Managers పనిచేయుటకు అభ్యర్థులు కావలెను. Retd., ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగస్తులు, Housewives కు ప్రాధాన్యత. Salary + Incentive ఇవ్వబడును. ఫోన్ : 94417 90382, 77023 85900 [V- 643]

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పెషేంట్లను పిల్లలను చూసుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతిఫుడ్ జీ:20k ఫోన్: 8977639662, 8977639663 [SCA25001369]

■ రాయపూర్ (ఛత్తీస్‌గఢ్) ఊరులో క్లౌడ్ కిచెన్‌లో తెలుగు వెజ్ వంటలు చేయడానికి ఒక అనుభవశాలియైన కుక్ కావాలి. జీతము వంట నైపుణ్యాలు బట్టి. సంప్రదించండి - 9425203443 [HA-7843]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

అనకాపల్లి : 9010546644
యలమంచిలి : 9951602901
చోడవరం : 9010210265
నర్సీపట్నం : 9010234557
పాడేరు : 9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

పడకేసిన పారిశుద్ధ్యం


తుమ్మపాల సంతలో ప్లాస్టిక్ వర్థాలతో దర్శనమిస్తున్న చెత్తాచెదారం

- తుమ్మపాలలో వ్యర్థాల నుంచి దుర్గంధం
- పలు గ్రామాలకు ముఖద్వారంలా డంపింగ్ యార్డు
- కనుమరుగవుతున్న వారపు సంత
- అధికారులు, పాలకుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల నిరసన

జిల్లా కేంద్రం అనకాపల్లితో శరవేగంగా అన్ని విధాలుగా అభివృద్ధి చెందాల్సిన మేజరు పంచాయతీ తుమ్మపాలలో పారిశుధ్య వ్యవస్థ పడకేసింది. ఇక్కడ చెత్తాచెదారాలతో వెలువడుతున్న దుర్గంధంతో వారపు సంత కనుమరుగయ్యే పరిస్థితి దాపురించింది. పైగా రోజు రోజుకూ జనాభా విస్తరిస్తున్న ఈ గ్రామానికి సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.




సంతలో డంపింగ్ యార్డు వద్ద గ్రామస్తుల నిరసన (ఫైల్)

తుమ్మపాల: మండలంలో మేజర్ పంచాయతీ తుమ్మపాలలో పారిశుధ్య లోపం వెంటాడుతోంది. గ్రామీణ జిల్లా కేంద్రం అనకాపల్లికి ఆనుకున్న తుమ్మపాలలో ప్రతి శనివారం నిర్వహించే సంతకు అత్యంత ప్రాచుర్యం ఉంది. రాజుల కాలం నాటి సంత కావడంతో జిల్లా నలుమూలల నుంచి రైతులు పశువులు, కోళ్లు, వ్యవసాయ పనిముట్లు, చిరుధాన్యాలు తీసుకొచ్చి క్రయవిక్రయాలు చేస్తుంటారు. అలాంటి సంత ఇప్పుడు దుర్గంధంగా మారిపోయింది. సంత జరిగే చోట ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తా చెదారాలతో అత్యంత దుర్భరంగా మారింది. అటుగా రాకపోకలు చేస్తున్న బవులువాడ, దిబ్బపాలెం, సంతబయల గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాలపై తప్పితే నడిచి వెళ్లే అవకాశమే లేకపోవడంతో ఆయా గ్రామస్తులంతా అధికారులు, పాలకులపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. సంతలో విక్రయానికి తీసుకొచ్చే రైతులు నిరాశ వ్యక్తం చేశారు.

ఊరి మధ్యలో డంపింగ్ యార్డు మార్చాలి

మేజర్ పంచాయతీ తుమ్మపాలలో పోలిపల్లెమ్మ ఆలయం, అత్యంత ప్రాచుర్యం పొందిన సంత వద్ద చెత్తాచెదారాలు డంపింగ్ చేసి అధికారులు, పాలకులు గ్రామాన్ని అధ్వానంగా చేస్తున్నారు. 20 వేల జనాభా కలిగిన గ్రామంలో పారిశుధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. ప్రజలు అనేక రోగాల బారిన పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఊరంతా చెత్తను సేకరించి సంతలో వేయడం ద్వారా వెలువడే వ్యర్థాలు, కాలుష్యం తిరిగి గ్రామస్తులకే ప్రభావం చేస్తున్నాయని వాపోతున్నారు. పారిశుధ్య వ్యవస్థను మెరుగుపరచాలని అనేకమార్లు వినతులు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఆరోపిస్తున్నారు. గ్రామంలో సేకరించిన చెత్తను సంతలో కాకుండా ఇతర ప్రాంతంలో తరలించి సంపద తయారు చేసేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పోలిపల్లెమ్మ ఆలయం చుట్టూ పారిశుధ్య లోపం...

ఏటా మార్చిలో నిర్వహించే పోలిపల్లెమ్మ పండుగకు డంపింగ్ సమస్య ఇబ్బందికరంగా మారింది.

పారబోసిన చెత్తను సంతలోనే కాల్చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

ఒకప్పుడు పరిశుభ్రంగా ఉండే ఆలయ పరిసరాలు ఇప్పుడు డంపింగ్ యార్డుగా మారాయి. దీంతో పాటు దిబ్బపాలెం, బవులువాడ గ్రామస్తులు నిత్యం ఆలయం పక్క నుంచి సంత మార్గం గుండా రాకపోకలు చేయాలంటే అసౌకర్యానికి గురవుతున్నారు. మురుగు నిల్వలు రోడ్డుపై ఉండటం, వర్షాలు పడినప్పుడు మరింత దుర్గంధం వెలువడటమే కాకుండా కుక్కలు, పందులు చనిపోయిన జంతువుల కళేబరాలు కూడా దర్శనమివ్వడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. అక్కడే తిష్ట వేస్తున్న కుక్కలు పాఠశాలలకు వెళ్లే పిల్లలను, పెద్దలను కరుస్తున్నాయి. చెత్త విపరీతంగా పేరుకుపోవడం వల్ల మలేరియా, డయేరియా వంటి వ్యాధులు ప్రబలుతున్నాయి.

పంచాయతీ పాలకులు పట్టించుకోలేదు



తుమ్మపాల గ్రామం మురుగు కూపంగా మారుతోంది. దాంతో అత్యంత ప్రాచుర్యం కలిగిన సంత కనుమరుగవుతోంది. పోలిపల్లెమ్మ ఆలయం పరిసరాలు అధ్వానంగా మారాయి. ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. జనాభాతోపాటు చెత్త పెరగడంతో పారిశుధ్య వ్యవస్థను మెరుగుపరచాల్సిన అవసరం పంచాయతీ పాలకులపై ఉంది. గ్రామస్తులు అనేక మార్లు వినతులు చేసినా అధికారులు కనీసం దృష్టి సారించడం లేదు. మార్చిలో జరిగే పోలిపల్లెమ్మ జాతరకు ఇబ్బంది లేకుండా చూడాలి.

– బొడ్డపాటి చిన రాజారావు, తుమ్మపాల, అనకాపల్లి మండలం

శాశ్వత పరిష్కారం చూపాలి



డంపింగ్ యార్డు తరలించాలని అనేకసార్లు పంచాయతీ అధికారులకు విన్నవించాం. సంత ప్రాంతాన్ని డంపింగ్ యార్డుగా మార్చేసి ఊరు చెత్తంతా తీసుకొచ్చి పారిశుధ్య కార్మికులు చేతులు దులుపుకుంటున్నారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగానే సంత వద్ద దుర్భరమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. సమీప గ్రామాల ప్రజలు వ్యాధుల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారు. గ్రామంలో దోమల వృద్ధికి కారణం సంత వద్ద చెత్తే.. అధికారులు స్పందించాలి. శాశ్వత పరిష్కారం చూపాలి.

– బి.శ్రీనివాసరావు, తుమ్మపాల, అనకాపల్లి మండలం

క్లుప్తంగా

ఆటోను ఢీకొట్టిన టిప్పర్


ప్రమాద స్థలంలో ఆటో, టిప్పర్

తుమ్మపాల: మండలంలో తుమ్మపాల రోడ్డులో క్వారీ టిప్పర్ల వల్ల ప్రమాదాలు నిత్యం చోటు చేసుకుంటూనే ఉన్నాయి. బండరాళ్లతో ఓవర్ లోడ్ వేసుకుని రోడ్డు మీదుగా తిరుగుతున్న వీటిని చూసి వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. క్వారీ టిప్పర్లకు దూరంగా ఉంటూనే వాహనాలను నడుపుతున్నారు. కాని టిప్పర్ల వేగానికి హద్దు, అదుపు లేకపోవడంతో నిత్యం పలు ఆటోలు, ద్విచక్ర వాహనాలను ఢీకొంటున్నాయి. మంగళవారం తుమ్మపాల పెట్రోల్ బంకు ఎదురుగా ఆగి ఉన్న ఆటోను టిప్పర్ ఢీకొంది. దీంతో ఆటోలో మహిళలు భయందోళనకు గురయ్యారు. ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాకపోవడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆటో వెనుక భాగం దెబ్బతింది. ఆటోకు అతి సమీపంలో టిప్పర్ వెళ్లడంతో బాడీ వెనుక డోర్ లాక్ చేసే షీల్ తగిలిందని, వేగం తగ్గించుకోవాలని స్థానికులు టిప్పర్ డ్రైవర్‌కు హెచ్చరించారు.

పంటలు తెగుళ్ల బారిన పడకుండా చర్యలు


అక్కిరెడ్డిపాలెంలో అవగాహన కల్పిస్తున్న ఏడీ రామారావు

అనకాపల్లి: కూరగాయలు, ఆకుకూరలు పండించే రైతులు పంటలు తెగుళ్ల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీ రామారావు సూచించారు. మండలంలో అక్కిరెడ్డిపాలెం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్ట ప్రాంతాల్లో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు రావాలంటే కూరగాయలు, ఆకుకూరలు తెగుళ్లు సోకకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి పి.రంగాచారి, గ్రామ సర్పంచ్ సాలాపు శాంతిసూరిఅప్పారావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నదానానికి రూ.లక్ష విరాళం


దాతకు బాండ్ అందిస్తున్న సూపరింటెండెంట్

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని ఎన్‌జీజీవోస్ కాలనీ దరి శాంతిపురానికి చెందిన కలిదిండి హేమసాయి రమణ లక్ష్మి అనే దాత రూ.లక్ష 1,116 విరాళాన్ని నగదు రూపంలో అందించారు. దేవస్థానం తరఫున అన్నప్రసాద విభాగం సూపరింటెండెంట్ సునీల్ దాతకు బాండ్ ఇచ్చారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 7,024 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,930	4,700
మొదటి రకం	3,560	4.140
రెండో రకం	2,950	3,700
మూడో రకం	2,800	3,010

అనకాపల్లి సినిమాలు

డాకు మహారాజ్	:రాజా
పుష్ప-2	:సత్యనారాయణ స్క్రీన్-1
సంక్రాంతికి వస్తున్నాం	:సత్యనారాయణ స్క్రీన్-2
గేమ్ ఛేంజ్	:పర్లిసాయి
సంక్రాంతికి వస్తున్నాం	:షిర్డీసాయి
హంగ్ కాంగ్ వారియర్స్	:వెంకటేశ్వర
సంక్రాంతికి వస్తున్నాం	:శ్రీసత్య
ఐడెంటీ	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 98 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-9 యూనిట్లు , బీ పాజిటివ్-33 యూనిట్లు, ఓ పాజిటివ్-48 యూనిట్లు, ఏబీ పాజిటివ్-8 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 383 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 347 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

శిథిలావస్థ భవనాల్లో అసాంఘిక కార్యకలాపాలు

చర్యలు తీసుకోవాలని ఆర్డీవోకు వినతి


ఆర్డీవో షేక్ ఆయిషాకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

అనకాపల్లి: పట్టణంలో కోట్లాది రూపాయలు విలువ కలిగిన ప్రభుత్వ స్థలంలో శిథిలావస్థకు చేరుకున్న భవనాలను తక్షణమే తొలగించి, జిల్లా కేంద్రాలకు కావలసిన భవనాలను నిర్మించాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బొట్టా చిన్నయాదవ్ కోరారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో షేక్ ఆయిషాకు మంగళవారం ఆయన వినతిపత్రం అందజేశారు. శిథిలావస్థ ప్రభుత్వ భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మారాయన్నారు. ప్రధానంగా పాత కోర్టు భవనం, పాత రిజిస్ట్రార్ భవనం, ఆర్ అండ్‌బీ బంగ్లా వంటి వాటిపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత అనేక ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉన్నాయన్నారు. వీటికి ఏటా కోట్లాది రూపాయలు ప్రభుత్వం అద్దె చెల్లిస్తుందన్నారు. ప్రభుత్వ స్థలంలో శిథిలావస్థకు చేరుకున్న భవనాలను తక్షణమే తొలగించి, నూతన భవనాలు నిర్మించాలన్నా రు. పలు సంఘాల నాయకులు బండి అప్పారావు, వాసుపల్లి తాతయ్యలు, బొబ్బిలి గోవిందరాజులు, భరిణికాన సూరిబాబు, సత్యసాయిబాబా పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌కు ఎంపికైన విద్యార్థులకు అభినందన


ఎంపికైన విద్యార్థులకు అభినందన

కశింకోట: స్థానిక సెయింట్ జాన్స్ స్కూలుకి చెందిన ఆరుగురు విద్యార్థులు మేథ్స్ అండ్ సైన్స్ ఒలింపియాడ్ రెండో దశకు ఎంపికైనట్లు స్కూల్ ప్రిన్సిపాల్ రూపనంది తెలిపారు. విద్యార్థులు డి. రుత్విక్ ఆర్యవర్ధన్, కె. టెర్రి థామ్సన్, కె. అభిరాం, కె.ఆదిత్య శ్రీపతి, టి.దేవి లిప్సిక, నిరంజన్ ఇటీవల జరిగిన మొదటి దశ పోటీలో ప్రతిభ చూపారన్నారు. తద్వారా ఫిబ్రవరి 9న జరిగే రెండో దశ పోటీల్లో పాల్గొంటారన్నారు. వారిని ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలి



సమావేశానికి హాజరైన ఆటో డ్రైవర్లు, ఇతర వాహనదారులు, మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ

అనకాపల్లి: వాహన చోదకులు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ తెలిపారు. మంగళవారం స్థానిక వేల్పులవీధి సీతారామ కల్యాణ మండపంలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని ఆటో డ్రైవర్లు, ఇతర వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోజు రోజుకు పట్టణంలో ట్రాఫిక్ సమస్య పెరుగుతుందన్నారు. జిల్లా కేంద్రం ఏర్పడిన తర్వాత అనకాపల్లి పట్టణానికి గ్రామీణ ప్రాంతాల నుంచి వాహనదారులు వివిధ పనులపై రాకపోకలు సాగిస్తున్నారన్నారు. అటువంటి వ్యక్తులు ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ శేఖరం, తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

కశింకోట: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 30న ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వి.వి. రవికుమార్ తెలిపారు. ఎంపీపీ కలగా లక్ష్మి అధ్యక్షతన జరిగే సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

రథసప్తమి వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు


ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి: రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. జీవీఎంసీ విలీన గ్రామమైన రాజుపాలెం సూర్యనారాయణమూర్తి దేవాలయంలో స్వామివారిని మంగళవారం ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిబ్రవరి 4న రథసప్తమి వేడుకలకు ఆలయానికి జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి సుమారుగా లక్ష మంది భక్తులు వస్తారన్నారు. వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యు లు, కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా రీ సర్వే

డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ఎం.వెంకన్న


గుల్లేపల్లిలో రీ సర్వేను పరిశీలిస్తున్న డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే వెంకన్న

సబ్బవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండవ విడత రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ఎం.వెంకన్న సూచించారు. పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన మండలంలోని గుల్లేపల్లిలో చేపట్టిన రీ సర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా రైతుల సమక్షంలో రీ సర్వేను నిర్వహించాలని సూచించారు. కమతాల హద్దుల నిర్ధారణ సమయంలో నాలుగు పక్కల ఉన్న రైతుల సమక్షంలో జరగాలని, విస్తీర్ణాలలో వ్యత్యాసం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మ్యాప్‌లను పరిశీలించారు. సర్వే అధికారులకు సహకరించేలా రైతులు విధిగా తమ భూ హక్కు పత్రాలను అందించాల్సిందిగా కోరారు. తహసీల్దార్ బి.చిన్నికృష్ణ, రీ సర్వే డీటీ గణపతిరావు, మండల సర్వేయర్ లాలం అప్పారావు, సర్పంచ్ బండారు మంగ, మాజీ ఎంపీపీ గండి దేముడు, బండారు శ్రీను, బోను గంగునాయుడు పాల్గొన్నారు.

207 పశువులకు వైద్య పరీక్షలు


కొత్తపల్లిలో పశువులను పరీక్షిస్తున్న కశింకోట పశు వైద్యాధికారి అల్ఫోన్సా జార్జ్


నూతలగుంటపాలెంలో పశువులను పరీక్షిస్తున్న నరసింగబిల్లి పశు వైద్యాధికారి చైతన్యమణి

కశింకోట: పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని రెండు గ్రామాల్లో మంగళవారం ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. 207 పశువులకు వైద్య సేవలందించారు. నూతలగుంటపాలెంలో నిర్వహించిన శిబిరంలో నరసింగబిల్లి పశు వైద్యాధికారి సిహెచ్. చైతన్యమణి 46 పశువులకు గర్భకోశ చికిత్సలు చేశారు. మరో 28 పశువులకు పరీక్షలు, 25 పశువులకు చూడి తనిఖీలు, 56 ఆవులు, దూడలకు నట్టల నివారణకు మందులు అందజేశారు. పశు వైద్య శిబిరాలపై అవగాహన కలిగించి, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశు వైద్య సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. కొత్తపల్లి గ్రామంలోని శిబిరంలో కశింకోట పశు వైద్యాధికారి అల్ఫోన్సా జార్జ్ 22 పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. 30 పశువులకు నట్టల నివారణ మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బుదిరెడ్డి గంగయ్య, కూటమి నాయకులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

చెట్టు కూలి ట్రాఫిక్‌కు అంతరాయం


తాళ్లపాలెం సంత వద్ద కూలిన గంగరావి చెట్టు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం సంత వద్ద మంగళవారం రాత్రి పెద్ద గంగిరావి చెట్టు కూలింది. నర్సీపట్నం-తాళ్లపాలెం మార్గంలో అకస్మాత్తుగా చెట్టు విరిగి పడింది. ఆ సమయంలో వాహనాలు, ప్రజలు ఎవరూ రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. చెట్టు సగానికి పడిపోవడం వల్ల రోడ్డుకు ఇరువైపులా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలిసిన వెంటనే సీఐ అల్లు స్వామినాయుడు తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్టును జేసీబీ సహాయంతో చెట్టును తొలగించారు. ట్రాఫిక్‌ను నియంత్రించడానికి చర్యలు తీసుకున్నారు. దీంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

ఉత్తమ ఆర్టీసీ కండక్టర్‌గా సీతారామరాజుకు అవార్డు


ఉత్తమ ఆర్టీసి కండక్టరుగా సీతారామరాజుకు ఉత్తమ అవార్డు అందుకుంటున్న దృశ్యం

మాడుగుల రూరల్ : ఆర్టీసీలో ఉత్తమ సేవలు అందించిన డెక్కల సీతారామరాజుకు రిపబ్లిక్ డే సందర్భంగా ఉత్తమ అవార్డు లభించింది. గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 26న విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో ఆర్టీసీ ప్రాంతీయ మేనేజర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందుకున్నట్టు సీతారామరాజు మంగళవారం విలేకరులకు తెలిపారు. కె.జె.పురం శివారు తెలకలదీపం గ్రామానికి చెందిన సీతారామరాజు వాల్తేరు డిపోలో పనిచేస్తున్నారు.

బడి బయట పిల్లల గుర్తింపు

రోలుగుంట : బడి బయట ఉన్న బడి ఈడు పిల్లల సర్వే కార్యక్రమం మండలంలో జోరుగా సాగుతుంది. సీఆర్పీలు చిరంజీవి, నూర్బీ వారి పరిధిలో గల గ్రామాల్లో ఇంటింటా తిరిగి బడి ఈడు పిల్లలను గుర్తించి వివరాలు నమోదు చేసుకుంటున్నారు. రోలుగుంట క్లస్టర్ సీఆర్పీ పి.సతీష్ కొంతలం గ్రామంలో మంగళవారం ఇంటింటా తిరిగారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

అనకాపల్లి :
9010973030, 9010546644, 9951602901
Office mail : sakshiadvtvsp@gmail.com

అధ్వాన రోడ్లతో అవస్థలు


పెదముషిడివాడ- అసకపల్లి మధ్య గోతులతో నిండిన రహదారి


రెండు నెలలు తిరక్క ముందే పెచ్చులుగా ఊడిపోతున్న వాడచీపురుపల్లి రహదారి


ఫార్మాసిటీ రోడ్డులో ఎగసిపడుతున్న దుమ్ము

పరవాడ: మండలంలో అధ్వాన రోడ్లతో గ్రామీణ ప్రజలు నిత్యం అవస్థలు ఎదుర్కొంటున్నారు. రోడ్లకు మహర్దశ పట్టిస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటనలు గుప్పించడమే తప్ప, కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో నరకం అనుభవిస్తున్నామని పెదముషిడివాడ పరిసర గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. పెదముషిడివాడ-అసకపల్లి గ్రామాల మధ్య రహదారి అధ్వానంగా మారింది. ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులపై అధికారులు కనీస చర్యలు తీసుకోలేదని స్థానికులు వాపోతున్నారు.

భారీ వాహనాలతో మరింత ఛిద్రం

ఈ రెండు గ్రామాల మధ్య పూర్తిగా ఛిద్రమైన రహదారిని బీటీ రోడ్డుగా తీర్చిదిద్దుతామని, అందుకు రూ.65 లక్షలు మంజూరైనట్లు పెదముషిడివాడలో జరిగిన సమావేశంలో వెల్లడించారు. నెలలు గడుస్తున్నా ఈ పనుల అతీగతీ లేదు. బూడిద, బొగ్గు లారీలు నిత్యం వందల సంఖ్యలో రాకపోకలు సాగించడం వల్లే చాలా వరకు రోడ్డు ధ్వంసమైనట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. భారీ గుంతలు ఏర్పడటంతో రాకపోకలు సాగించడం కష్టంగా మారిందని వాపోతున్నారు. నిత్యం రహదారిలో వందల సంఖ్యలో ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాలు, కార్లు మరమ్మతులకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నెలలు తిరక్కముందే గోతులు

రెండు నెలల కిందట మరమ్మతులు చేపట్టిన వాడచీపురుపల్లి-ఎన్టీపీసీ రహదారి నెలలు తిరక్కముందే పెచ్చులుగా ఊడిపోయి గోతులు ఏర్పడ్డాయని ప్రయాణికులు ఆక్షేపిస్తున్నారు. ఇక్కడి ప్రజయ్ లేఅవుట్ వద్ద రోడ్డు పెచ్చులుగా ఊడిపోవడంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో పాటు ఊటడెడ్డ కూడలికి సమీపంలో మరమ్మతులు చేసిన రోడ్డు నెలలు తిరక్క ముందే పగుళ్లు వేసి పెచ్చులుగా ఊడిపోతోంది. పరవాడ-ఫార్మాసిటీ రోడ్డులో పలు చోట్ల రోడ్డు ధ్వంసం కావడంతో రహదారిలో ఏ చిన్న వాహనం వెళ్లినా దుమ్ము, ధూళి కమ్ముకుంటోంది. రహదారిలో ప్రయాణాలు సాగించడానికి పడరాని పాట్లు పడుతున్నామని, దుమ్ము ధూళితో అనారోగ్య సమస్యలకు గురవుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ముందుకొచ్చి రోడ్ల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని పరవాడ పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.